# పదిరూపాయలు

కూనిరాగం తీసుకుంటూ జింకలా ఆడుతూ పాడుతూ, గది శుభ్రంచేసి నీళ్ళు కూజాలో నింపి పెడుతూన్న ఆ పిల్లకేసి అలాగే చూస్తూండిపోయాడు రాజారాం. వెలిసిపోయిన పరికిణీ, చిరిగిపోయిన వోణీ సంస్కారం లేక చిందర వందరగా వున్న జుట్టు. నుదుటిమీద చుక్కలా పొడిచిన పచ్చబొట్టు. అయినా ఏదో వింతకళ దానిమొహంలో మెరుపులా కనిపించిందతనికి. ఆ కుర్రదాన్ని చూస్తూన్నకొద్దీ చూడాలన్న ఆప్యాయత అతణ్ణి తికమక చేసింది.

"పోతున్నయ్యా పనై పోయింది" అంటూ వెళ్ళిపోతున్నది "ఏఁస్ పిల్లా!" అన్న పిలుపుకి గిర్రున వెనక్కి తిరిగింది. "నీ పేరేమిటి?" "రాణి" అంది చిన్నగా నవ్వుతూ.

"ఊఁ...అసలు రాణిలాంటి కళేవుంది. మొహంలో పాపం, దాసీ పని చేస్తున్నావు కానీ—" అంటూ నవ్వాడు రాజారాం.

దానికేం అర్థమయిందో. అదీ నవ్వేసింది. "ఇంద ఈ డబ్బు పట్టు కెళ్ళి ఏమైనా కొనుక్కో" అంటూ పదిరూపాయల కాగితం చేతిలో పెట్టాడు

"పది రూపాయలే" అంది గుడ్లుతిప్పుతూ రాణి.

"ఫరవాలేదులే తీసుకో''

పుచ్చుకుని కాళ్ళకి దణ్ణం పెట్టింది.

"హాఁ ..హాఁ...హాఁ...ఒద్దొద్దులే" అంటూ దూరం జరిగాడు.

"పోతున్నా" అంటూ వెళ్ళబోయింది.

"సరేగానీ ఈ డబ్బుతో ఏంచేస్తావ్?"

"ఆఁ...ఏం జేస్తనంటే, వొక రూపాయేమో సేపులు కొంట. వొక రూపాయి సపోటలు కొంట. ఒక్క రూపాయి శామంతిపూలు కొని నెత్తినిండ పెట్టుకుంట. ఇంకొక్క రూపాయి కొబ్బరికాయ కొని అమ్మోరి గుడికి కొట్టొస్తా... ఇంకా గాజులూ, రిబ్బన్‌లూ కొనుక్కొని మిగుల్తే ఒక సీనిమ చూస్తా..." గుక్క తిప్పకుండా చెప్పుకుపోతూన్న దానికేసి గుడ్లప్పగించి చూశాడు రాజారాం. అతనేమీ మాట్లాడకుండా అలా చూస్తూ వుండడంచూసి మళ్ళీ అదే మొదలెట్టింది. "అవునయ్యా! సేపులు, సపోటలు కొనమంటే ఆవ్వీ గొప్పోళ్లతినేటియి. మనమేడికెళ్ళి కొంటం అంటది అమ్మ. పూలు కొనాలన్నా అదేమాట. సీనిమలన్నా ఆదేమాట, అయినా అమ్మదేం తప్పులేదు. అమ్మకాడ పైసలుండవు, అయ్యదెచ్చేది పొట్టకే సాలదు. అందికే ఈ పైసతోటి కొనుక్కొని తమ్ముడు సీనుగాడికియ్యా డిస్తా" అంటూ "దండాలయ్యా'' అనుకుంటూ మరి తిరిగి చూడకుండా పరుగుతీసింది రాణి. కనుమరుగయ్యేదాకా ఆ పిల్లని చూస్తూంటే, మనసు

రాలు జోత్స్న జ్ఞాపకం వొస్తోంది. అదీ ఇలాగే చలాకీగా వుంటుంది అస్తమానం "తాతయ్యా తాతయ్యా "అంటూ వెంట తిరిగేది వాళ్ళనాన్న రఘునాధరావుకి, అమెరికా వెళ్ళే అవకాశం వొచ్చేసరికి అందరూ అక్కడికి వెళ్ళిపోయారు. కొడుకూ, కోడలూ, మనవడూ వెళ్ళిపోయాక వొంటరివాడయిపోయాడు తను. కొడుకు భవిష్యత్తుకి అడ్డురావడం ఇష్టం లేక వెళ్ళమన్నాడే కానీ, నిజానికి ఈ వయస్సులో తను వొంటరిగా వుండాలే అన్న బెంగ అతనికి లేకపోలేదు. చలాకీగా తన మనవరాలి ఈడులోవున్న పిల్లలెవరు కనిపించినా, వాళ్ళలో జోత్స్నని చూసుకుని మురిసిపోతాడు. ఇవ్వాళ, రాణిలో జొత్స్నని చూసుకుని ఆనందంతో పది రూపాయలు చేతిలో పెట్టాడు. ఆ పిల్ల వెళ్ళిపోయాక తృప్తిగా నవ్వుకుని, పేపరు చదువుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు రాజారాం.

ం ం ం

"ఈ డబ్బెక్కడి నుంచొచ్చింది?" ఉరుములా అరిచింది రంగమ్మ. ఆ అరుపుకి బెదిరినట్టు, ఒడిలో వక్కా, పూలు జారి కిందపడిపోయాయి.

"బంగళా వూడుస్తే ఆ అయ్య యిచ్చిండు పదిరూపాయలు" అంది భయంగా రాణి.

అంతే, భద్రకాళిలా దాని జుట్టు పట్టుకుని రెండు చెంపలూ, ఫెళా ఫెళా కొట్టింది రంగమ్మ. "అమ్మా! అయ్యో" అని గిలగిల్లాడి పోయింది రాణి. అయినా వెఱ్ఱి ఆవేశం రంగమ్మని పిచ్చిదాన్ని చేసింది "నా రాత నీకొద్దను కున్నానే పాడుముండా" అంటూ వీపుమీదా, నెత్తిమీద బాదడం

మొదలెట్టింది. సమయానికి నర్సింలొచ్చి అడ్డు పడ్డాడు. కొట్టి కొట్టి అలిసి పోయిందేమో రంగమ్మ, గుడిసె అవతలికిపోయి కూర్చుంది.

రాణి ఒక మూలకి ఒదిగి ముడుచుకుని పడుకుంది ఏడుస్తూ. "ఏం జరిగిందే?" లాలిస్తూ అడిగాడు నర్సింలు. "అదిగాదయ్యా! ఇయ్యాల్ల బంగళా ఊడిసే మల్లమ్మ రాకపోతే నన్నూడవమని కేకేసేడు వాచ్‌మన్ రామన్న. సరేనని ఊడిస్తే ఆ దొర పదిరూపాయలిచ్చిండు ఏమన్న కొనుక్కోమని. పూలు, పండ్లు కొనుక్కొనొస్తే అమ్మ కొట్టింది." ఏడుస్తూ చిందర వందరగా పడున్న పళ్ళూ పువ్వులకేసి చూపించింది.

"ఏడ్వకుబిడ్డ అమ్మ ఇయ్యాల ఏదో కోపంలో వున్నట్టుంది తిని పడుకో" అంటూ కింద పడున్న ఆ పళ్ళూ పూలు తీసి ఒక పక్కన పెట్టాడు.

"నాకాకలైతలేదు" అంది రాణి.

"నేనొల్ల" అంది రంగమ్మ.

ఇద్దర్నీ బతిమాలి నాలుగు ముద్దలు తినిపించేసరికి తాతలు దిగొచ్చారు నర్సింలుకి. సుఖాసంగానే అందరూ పక్కమీది కొరిగారు. రంగమ్మ ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి.

ం ం ం

అడొక ట్రావెలర్స్ బంగ్లా.

ఆ రోజు పట్నంనుంచి ఎవరో ఒక దొర ఒస్తాడని తెలీగానే, గది శుభ్రంచేసి నీళ్ళు పట్టి పెట్టమని చెప్పాడు బంగ్లా తాలూకు బుకింగ్ క్లర్క్.

దుప్పట్లూ, తలగడా కవర్లూ మార్చింది. కూజాలోనూ, బకెట్లోనూ నీళ్ళుపట్టి పెట్టింది, రంగి. అత కొచ్చేదాకా వుండి వెళ్ళమన్నాడతను. అందుకని కూర్చుంది అక్కడే. కనుచీకటి పడుతుంటే, రయ్యుమని దూసుకొచ్చిందొక కారు. "దొరగారు...దొరగారు" గౌణిగాడువాచ్‌మన్. వెళ్ళి కారు తలుపు తెరిచాడు.

అందులోంచి దిగాడు ఒక పాతికేళ్ళ యువకుడు, బూట్లు టక టక లాడించుకుంటూ, సిగరెట్టు పొగ గుప్పున వొదులుతూ. అతను నడిచిన ప్రతి అడుగులోనూ అత్తరువాసన గుప్పుమంటోంది. నల్లటి ఒత్తయిన జుట్టు. పచ్చటి శరీరం, అతడుపాడే ఈలపాటా గమ్మత్తనిపించింది రంగికి. రెప్పవాల్చకుండా చూస్తుండిపోయింది, ఆశ్చర్యంగా అతన్ని.

"ఏయ్ ..అమ్మాయ్... నీపేరేంటి?" అన్నాడతను.

"రంగి."

"రంగీ—ఒక అగ్గిపెట్టె తెచ్చిపెట్టు," డబ్బులిచ్చాడు.

ఒక్క పరుగులోవెళ్ళి తెచ్చి ఇచ్చింది. అంతలోనే అతను బట్టలు మార్చుకుని, టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. పాటలు వింటూ పాటతో పాటు ఈలవేస్తూ మంచం మీద పడుకున్నాడు. కాస్సేపు వరండాలో నుంచుని పాటలువిని వెళ్ళిపోయింది రంగి.

పగలంతా ఎటో తిరిగొస్తాడు. సాయంత్రం పాటవింటూ కూర్చుంటాడు. వారం రోజులుంటాట్ట వాచ్‌మన్ చెప్పాడు రంగికి. ఎంచక్కా రోజూ పాటలు వినొచ్చని మురిసిపోయింది.

ఆ రోజు అతనొచ్చేసరికి కొంచెం పొద్దుపోయింది. తూలుతూ వచ్చాడు. బట్టలు మార్చుకుని పాటలు వింటున్నాడు.

"ఏమైనా కావాలా బాబూ!" అమాయకంగా అడిగింది రంగి.

"వద్దులే."

చీకటి పడిందని గబగబా వెళ్ళబోయింది రంగి.

"ఏయ్ రంగీ—ఇలారా—ఇవ్వాళ పాటలు వినవూ?" అన్నాడు.

''ఆద్దొర ఇంటికాడ అయ్య ఎదురు సూస్తుంటాడు.''

"ఫరవారేదులే కాస్సేపు కూర్చో."

ఇబ్బందిగా కింద కూచుంది రంగి,

ఉన్నట్టుంగి వాంతి చేసుకున్నాడతను తూలిపోతున్న అతణ్ని పడిపోకుండా పట్టుకుంది రంగి. వాంతి పడ్డచోట శుభ్రం చేసొచ్చి నంచుంది వెళతానని చెప్పడానికి. చెయ్యి పట్టుకుని మంచంమీద కూర్చోబెట్టాడతను. అత్తరు వాసన, బ్రాంది వాసన కలిసి ఉక్కిరి బిక్కిరి చేశాయి రంగిని నడుంచుట్టూ వేసిన అతనిచేతి స్పర్శ ఏదోలా అనిపించింది. దగ్గరికి తీసుకున్నాడతను.

"నేనంటే ఇష్టమా?" అడిగింది.

"అవును" అన్నాడు.

"అయితే నన్ను పెళ్ళిచేసుకుంటారా?"

''పెళ్ళా?'' నవ్వాడతను. మరింతదగ్గరకి తీసుకుంటూ,

ఆ నవ్వునీ, అతని ప్రవర్తనని. అంగీకారంగా నమ్మింది రంగి. అతనికి లొంగింది.

మరో నాలుగు రోజులున్నాడతను. ఆ రోజు ఉదయం పది రూపాయల కాగితం చేతిలో పెట్టి వెళ్ళాడు. మరి రాలేదు 'ఎప్పుడు పెళ్ళి చేసుకుంటారు?' అని అడుగుదా మనుకుంది. ఆ ప్రశ్న గొంతు దాటకుండానే అతను ఊరు దాటేశాడు. అతను తిరిగి రాకపోతాడా అని ఏ కారు ట్రావెలర్స్ బంగళాలో కొచ్చినా పరుగెత్తుకొచ్చి చూసేది... మనసులో నిరాశ గూడు కట్టుకుంటే కడుపులో బిడ్డ చోటుచేసుకుంది. ఒకనాడు మరిదాచుకోలేక. తల్లీ తండ్రీ అన్నీ తనే ఐన తండ్రితో కక్కేసింది నిజాన్ని. ముసిలాడు గుండె బాదుకున్నాడు. విషం తాగుతానన్నాడు.

ఇవేవీ అక్కర్లేకుండానే గుండెనొప్పి అతణ్ణివరించింది. ప్రాణం పోయినాసరే, పరువు పోకూడదని ఏడుస్తూన్న తండ్రికి నర్సింలు మావ తనని చేసుకుంటానని చెప్పి మాటిచ్చాడు. మనశ్శాంతితో చచ్చిపోయాడు తండ్రి.

కురూపి అయిన నర్సింలుని, నల్లగావున్న రంగినిచూసి. రాణి ఎర్రగా ఆపిల్ పండులా ఎలా పుట్టిందా అని అడుగుతాడు అందరూను.

"అది పోయిన జనమలో రాణయి ఉంటదండీ. ఈ జనమలో ఏం పాపం సేసుకున్నాదో మా కడుపున పుట్టిందండి" అని చెప్పే నర్సింలు కేసిచూసి ఆరాధనతో, కృతజ్ఞతతో నమస్కరించేది రంగి

"నారాత నీకు రాకూడదు తల్లీ!..." అంటూ ఆప్యాయంగా ముద్దు పెట్టుకునేది బిడ్డని.

• • • • •

గతం కళ్ళ ముందు కదిలి. కన్నీళ్ళు మొహాన్ని కడిగేశాయి నర్సింలు చేతులు బుగ్గల్ని తడుముతుంటే ఉలిక్కిపడింది రంగమ్మ.

"ఏడిసేంలాభం?" అన్నాడు నర్సింలు లాలనగా.

"దాని బతుకంతా ఏడుపవుతుందేమోనని నాభయం మావా!" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"నల్లనియన్నీ నీళ్లూ కావు. తెల్లనియన్నీ పాలూకావు. రాళ్లూ, రత్నాలు ఒక్కసోటే వుంటయి. ఎదేదో తెలుసు కోందే మాట్టాడకూడదు."

"తెలవాల్ననే కదాకొట్టిందిమావా... లేకపోతే. పాడు వది రూపాయలు బతుకుల్నే బజారుపాలు జేస్తయి" అంది.

"అవును నిజమేలే. నల్లే పడుకో పొద్దు పోయింది..." అన్నాడు తలనిమురుతూ.

"నాకొద్దుకారా పైసలు. నేను తీసుకోను" అంటూ కలవరిస్తూన్న కూతుర్ని చూసి తృప్తిగా నిట్టూర్చింది రంగమ్మ.

ఎఱ్ఱగా కందిపోయిన దాని బుగ్గల్ని నిమురుతూ, దగ్గిరిగా జరిగింది. తల్లికౌగిట్లో పసిపిల్లలా ఒదిగి ఆదమరచి పడుకుంది రాణి.

"ఇంక ఫరవాలేదు. నా చిట్టితల్లి ఎప్పుడూ మోసపోదు. నేను కొట్టిన దెబ్బలు తెల్లవారేసరికి మానిపోతాయ్ కానీ, జీవితంలో మాసిపోని ఎదురు దెబ్బలు తినే ప్రమాదం నా బిడ్డకిలేదు—" అనుకుని తృప్తిగానవ్వుకుంది రంగమ్మ.